# రామనాథం బాబాయ్!

**మా** రామనాథం బాబాయ్ మొట్ట మొదటిసారిగా తెలుగు రాజధానికి వేంచేస్తున్నాడని తెల్సి అజ్ఞానాంధకారంలో వురిపోయి, అమాయక వెధవాయిలా సంతోషాన్ని ప్రకటించేనేగానీ, సదరు బాబాయి అని పిలువబడే ఘటాన్ని బస్సు దిగేక ఇంటికి చేర్చే పని నాపైనే పడబోతోందనిగాని, తత్కార్యం వల్ల నా తనువులోని అణువణువు అలసి సొలసి అల్లాడిపోయే తరుణం ఆసన్నమైందనిగాని ఆకాశంలో తిరిగే దేవతల్లో ఏవొక్కతయినా గొంతెత్తి విషయం చెప్పి పారిపొమ్మంటే ఇంట్లో జనాలకి సంతాపదినాలు ప్రకటించి నేను మాత్రం ఏ హరిద్వారమో, రుషి కేశమో రిజర్వేషన్ లేకపోయినా నిల్చునయినా పారిపోయి వుండే వాడిని. ప్చ్... అనుకుంటాం గానీ, అన్నీ మనం ఊహించినట్టు జరుగుతాయా? తానొకటి తలిస్తే దైవం వేరొకటి తలుస్తుందని అంచేతనే కాబోలు మా తాతయ్య... మహానుభావుడు చచ్చి ఏ లోకంలో ఎవళ్లని కాల్చుకు తింటున్నాడో గాని అన్నీ రివర్స్‌లో కోరుకునే వాడు. అదేవిటో ఆయన కన్నీ శుభాలే జరిగేవి (ట). నే పుట్టినపుడు మంత్రసాని నాకు స్నానం చేయించి వసరాలో వున్న తాతయ్యకి 'మీ మనవడు ఎంత అందంగా వెలిగిపోతున్నాడో చూడండి! అంటూ చూపిస్తే ఆయన నన్ను పరీక్షగా ఎగాదిగా చూసి 'వెధవ', దీపంలాగా ఉన్నాడు. ఆ కళ్లు, ముక్కు, ఆ జుట్టు... పురిట్లోనే పోతే బాగుండు అన్నాట్ట. ఆ మాటలకి మంత్రసాని గాలి పీల్చుకోవాలన్న ప్రాథమిక బాధ్యతని గూడా మర్చిపోయి నిలువు గుడ్లతో చేతిలో పసి గుడ్డుతో (అంటే నేనన్నమాట) నిలబడి పోయిందట. ఇహ మా అమ్మ నాయనమ్మలు సరేసరి– 'లబోదిబోట. ఇదంతా నాకు ఆయనే చెప్పి అలా ఆ రోజు అన్నాను కాబట్టి నీకు నూరేళ్లు ఆయుషు పో! అని నవ్వేడు. ఇంతకీ చెప్పొచ్చేదేవిటంటే జరగబోయేది నాకు ముందుగా తెలిసివుంటే నేను కూడా మా తాతలాగా మా బాబాయి ప్రయాణం చేసే బస్సు క్షేమంగా ఏ ప్రమాదాలకు లోనుకాకుండా రివర్స్‌లో కోరుకుని ఉండేవాణ్ణి.

అసలు బాబాయి అంటే మా నాన్న తమ్ముడన్న మాట. అంతా తాతయ్య పోలికే. అలవాట్లు నమ్మకాలు పట్టింపులు కోపాలు తాపాలు అన్ని తాతగారి పద్ధతే. మా తాతగారు ఆవేశంలో గాంధీ గారిని తూ.చా తప్పకుండా ఫాలో అయ్యేవాడు. ఖద్దరు ధరించడం, మేకపాలు స్వయంగా పితుక్కొని త్రాగడం, నాయనమ్మ మీద కోపం వస్తే సత్యాగ్రహరేఖుడం, పట్టించుకోకపోతే నిరాహార దీక్ష చేస్తానని బెదిరించడం (అప్పుడప్పుడు చేసే వాడు గూడానట). ఊళ్ళో కాస్తపరపతి కలిగిన వారు కళ్లు తేలేస్తే గౌరవ సూచకంగా ఇంట్లో మూడు రోజుల నుంచి ఐదు రోజుల దాకా సంతాప దినాలుగా ప్రకటించడం.. ఇలా వేపుకు తినేవాడట. సంతాప దినాల్లో తీపి వంటకాలు వండకూడదట. కాఫీ కూడా విత్‌ఔట్ షుగర్ త్రాగాలి.

ఆ నాలుగైదు రోజులు పండుగలు పుట్టిన రోజు చివరికి గర్భదానాలైన సరే వాయిదా వేయాల్సిందే. ఎవరన్నా పంతం కొద్ది పవర్‌ఫుల్ జోక్‌గాని వినిపిస్తే ఎద్దుబండిలో వెళుతున్న దేవదాసులాగా విషాదంగా నవ్వేవాట్ట.

అసలు ఇదంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే మా రామానాథం బాబాయ్ అంతా ఇదే తంతు కాబట్టి తాతయ్యని నిల్చోబెట్టి ఏ రుషేశ్వరుడో మంత్రించి నీళ్లు చల్లి ఆయన్ని ఓ 30 ఏళ్లు వెనక్కి పంపిస్తే ఆయనే మా రాంనాథం బాబాయ్ అన్నమాట.

ఇంతకీ ఏం జరిగిందంటే– లేక జరిగింది ఎలా మొదలైంటే రాత్రి మా పిన్ని అంటే ఈ రామనాధం గారికి స్వయానా భార్యవచ్చి, వొరే మీ బాబాయి రేపొద్దున అయిదు గంటలకల్లా బస్సుస్టాండులో దిగేస్తారు. శీను (అంటే బాబాయి గారిసుపుత్రుడు) అనుకోకుండా ఆఫీసుపని మీద వరంగల్ వెళ్లాడు. నాకు, శాంతకి (అంటే బాబాయి కోడలు) అసలే వూరు కొత్త. అందులో పొద్దున్నే చీకట్లో ఎలా వెళ్లేది అంచేత మా నాయన నీకు పుణ్యం వుంటుంది కాస్త గుర్తుపెట్టుకుని వెళ్లి మీ బాబాయిని తెచ్చి ఇంట్లో పడెయ్యి. అనటంతో మొదలైంది కథ.

'దానికేవుంది పిన్నీ... అలాగే... అయినా చెట్టంత నే వుండగా ఆడవాళ్లు మీరు వెళ్లడం ఏమిటి? బాబాయి సంగతి నే చూసుకుంటాగా! అని తేలిగ్గా అన్నానే గాని' తర్వాత అలా అన్నందుకు నాకు నేను నిజాయితీగా నెత్తిమీద రెండు ఇచ్చుకున్నాను.

రామానాథం బాబాయి కొడుకు శ్రీనివాసరావుకి రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లో ఉద్యోగం వచ్చింది. ఏడాది క్రితం పెళ్లి అయింది. పెళ్లయ్యాక దాకా మా ఇంట్లో మాతోపాటు ఉండేవాడు. ఈ మధ్యనే వేరే ఇల్లు తీసుకొని పెళ్లాన్ని కాపురానికి తెచ్చుకున్నాడు. బాబాయికి వెనుక ముందు ఏబాదరబందీ లేకపోవడం చేత కొడుకుతో పాటే ఉందామని వున్న ఊరుతో తెగతెంపులు చేసుకుని రాకెట్ స్పీడ్‌లో రాజధాని నగరానికి వేంచేస్తున్నాడు. భార్యని ముందే పంపించి ఊళ్లో ఇంకా చక్కదిద్దాల్సిన వ్యవహారాలు చక్కదిద్ది మరీ వస్తున్నాడన్నమాట. వాళ్ల అబ్బాయి సమయానికి ఊళ్లో లేకపోవడంతో బస్సువద్ద కెళ్లాల్సిన పని

నాపై పడింది.

సరిగ్గా నాలుగు గంటలకి గడియారం అలారం గంట కొట్టింది. సినిమాలో చినబాబు లాగా విసుగ్గా మరో వైపుకి సర్దుకుపడుకున్నాను గాని బుజ్జి ముండ ఫైరింజన్‌లాగా ప్రమాదాన్ని హెచ్చరిస్తుందని ఊహించలేకపోయాను. నాలుగున్నరకి ఇక తప్పదని లేచి మొహం కడిగి ప్యాంటు, షర్ట్ తగిలించుకుని వీధిలోకి వచ్చాను.

మంచు వుల్లిపొర కాగితం లాగా వీధి అంతా వ్యాపించి వుంది.

పాల వ్యాను రాక కోసం ఎదురుచూస్తున్న వాళ్లు గుర్తుపట్టడానికి వీలు లేనంతగా తల గుడ్డలు చుట్టుకుని శవ జాగారం లాగా ముడుచు పెట్టుకుని కూర్చొన్నారు.

వాళ్లని దాటుకుని మెయిన్‌రోడ్డు పైకి వచ్చాను గుండె.

ఝల్లు మన్నది. కనుచూపు మేరలో రిక్షా గాని ఆటోగాని లేవు అప్పటికే నాలుగు ముప్పావు అయింది. ఇంకా పావుగంటలో బాబాయి వచ్చేస్తాడు. చకచక నడక ప్రారంభించాను. చలి ఇబ్బంది పెడుతోంది. ముందు చూపుతో మఫ్లర్ తెచ్చుకోనందుకు నాకు నేనే మందలించుకుంటూ మరో పది అడుగులు వేసే సరికి ఎదురుగా ఒక ఆటో కనిపించి రోడ్డు మధ్యలో నిలబడి రెండు చేతులూ పై కెత్తి ఎగురుతూ చిన్న సైజు నాట్యం లాంటిది చేశాను. ఆటో వాడు నా పరిస్థితి చూసి భయపడ్డాడో జాలిపడ్డాడో గాని ఆటోని మాత్రం ఆపి నావంక నిద్ర కళ్లతో ప్రశ్నార్థకంగా చూశాడు. 'బస్టాండ్' అంటూనే ఆటో ఎక్కి కూర్చోబోతుండగా 'స్టేషన్' అని అతడనగా నా పదప్రయోగం అతనికి తేటతెల్లం కాలేదేమోనని పూర్తి తెలుగులో 'ఇందనశకట ప్రయాణీకులవి సర్జనా కేంద్రం' అని చెప్పడం నాకు చెయ్యెత్తి నమస్కారం చేసే వాడో లేక చెప్పుచ్చుకు వెంటపడే వాడో తెలియదు గాని నాకా అవకాశం ఇవ్వకుండానే రైలు స్టేషన్‌కు అయితే వస్తానని నిస్సందేహంగా చెప్పి దిగమన్నట్లు విసుగ్గా చూశాడు. బాబాయి రైల్లో వచ్చుండినా బాగుండేది అనిపించింది ఆ క్షణంలో లాలించి బుజ్జగించి బ్రతిమాలి, బామాలి ఇక లాభం లేదని ఆఖరి అస్త్రం ప్రయోగించాను. మీటరు పైన కాస్తో కూస్తో తీసుకో కావాలంటే– రానంటే ఎలా చెప్పు వగైరా అంటుండగానే అయితే 20 రూపాయలు ఇప్పించడండి అనేశాడు నిర్దయగా. ఎక్కడ మూడు రూపాయలు ఎక్కడ ఇరవై రూపాయలు? కాని తప్పదు. గ్రహచారం సరిగ్గా లేకపోతే బాబాయి గాళ్లు బస్సుల్లో రావటాలు ఆటో వాళ్లకి మనం దొరికిపోవడాలు జరుగుతాయి. కాబోలు సరే అన్నాను.

ఆలో కదిలింది.

బస్సు స్టాండుకి వెళ్లే సరిగి అయిదుంపావు అయింది.

వాతావరణ సందడిగా వుంది. వస్తున్న బస్సులు దిగుతున్న జనం రిక్షాల వాళ్లు, ఆటోవాళ్లు గుంపులు గుంపులుగా దిగుతూ ప్రయాణీకులను చుట్ట పెట్టడం చూస్తుంటే పడిన కష్టం అంతా మర్చిపోయి కొండంత ధైర్యం వచ్చింది కనీసం తిరుగు ప్రయాణమన్నా మీటరు ప్రకారం పోవచ్చుగదాని.

జనాన్ని తప్పించుకుంటూ కాస్త ముందు కెళ్లాను.

మా వూరి నించి రావాల్సిన బస్సు ఇంకా వచ్చినట్లు లేదు. గాజు గోడల గదిలో కూర్చున్న కంట్రోలరు దీనిపైన కంట్రోలు లేనట్లు దిగులుగా, దిగాలుగా కుర్చీలో జారిపోయి కూర్చున్నారు. నియాన్ లైట్ల చుట్టూ తిరుగుతున్న దోమలు వుండి వుండి ప్రయాణీకులని రుచిచూసి వెగటుగా మొహాలు పెట్టి వెనక్కి వెళ్లిపోతున్నాయి. నిద్రావస్థలో వున్న కంట్రోలరు రుచి చూసివచ్చిన ఆడదోమ, మొగ దోమతో ఎంత సేపని అలా తిరుగుతారు. అలా వెళ్లి ఎంగిలి పడి రండి. రుచిగా వున్నారు వెధవలు అన్నట్లుంది కంట్రోలరు తల తిప్పి బయటికి చూశారు. ఇంతా చేసి నేనేం అడక్కుండానే బస్సు కాస్తా రావే వచ్చింది

జనం దిగుతున్నారు.

నా కళ్లు బాబాయి కోసం ఆత్రంగా వెతుకుతున్నాయి. ఆడ, మగ, పిల్లలు అంతా దిగేస్తున్నారు. కాని బాబాయి జాడ మాత్రం లేదు. చివరగా ఒకాయన దిగేరు. చూట్టానికి చిత్రంగా అనిపించి పరీక్షగా చూశాను.

పాతకాలం ఎర్రపట్టు బట్టని గూడకట్టు కట్టి దాని మీద తెల్లలాల్చి వేసేరు దాంతో ఆగక, పాకుడు రంగు పాత స్వెట్టర్ తొడిగి తలకి దట్టంగా గుడ్డలు చుట్టి చలిగాలిని దెబ్బ తీయడానికి నల్లటి కళ్లజోడు పెట్టేడు.

పెద్ద నిలువెత్తు రోకలి చేత్తో పుచ్చుకు మరీ దిగేడు. దిగి ధర్మదర్శనం చేస్తున్నవాడలా చలనం లేకుండా నిల్చుండిపోయేడు. దిగేసిన జనం దిగాలనుకుంటున్న డ్రయివరు రిక్షా, ఆటోల వాళ్ళు, కునికిపాట్లు పడుతున్న కంట్రోలరు అంతా ఆ వ్యక్తివంక తేరిపార చూస్తున్నారు.

ఎవరీ వ్యక్తి? త్యాగరాజయితే  చేతిలో తంబూరా ఉండాలి. క్రీడాకారుడయితే ఆట సామాగ్రి ఉండాలి. వుగ్రవాదయితే తుపాకీ వుండాలి. వాళ్ళని పట్టు కోడానికి ప్రభుత్వం కొత్తగా ఏర్పరిచిన దళానికి కమాండరయితే?... ఛఛఛ ప్రభుత్వం ఎంత ఆర్ధిక చిక్కుల్లో ఉన్నా ఇలా రోకళ్ళు, పచ్చటి బండలూ ఇస్తారా? ఇంపాజిబుల్? అయితే ఏవరీయన?

ఇదంతా ఇలా జరుగుతుండగా మా బాబాయి కోసం నేను బస్సు కిటికీ చువ్వలు పుచ్చుకుని షోడాకాయలు అమ్మేవాడిలాగా ఎగిరెగిరి వెతుకుతుండగా ఎవరో వెనుకనుంచి ఇంకెవరి కోసం చూస్తున్నావురా పెద్దోడా! అంటూ వినిపించేసరికి వులిక్కిపడి వెనక్కి తిరిగి చూద్దునుగదా, గొంతేమో బాబాయిదే. కాని... కాని... అతడే ఆ రోకలి వీరుడు గ్రీకు సైనికుడిలా నిల్చుండడం చూసి అవాక్కయిపోగా, నా పరిస్థితి గమనించినట్లు కాస్త రెండడుగులు ముందుకొచ్చి నేనేరా గుర్తుపట్లేదా! అంటూ నల్లకళ్ళద్దాలు తీసేస్తేనేగాని బాబాయిని బాబాయిలా అంగీకరించలేకపోయాను.

ఇదేం అవతారం బాబాయ్! (అసహ్యంగా అని లోపల) అన్నాను. బాబాయ్ ఆ మాట విని పెద్దగా నవ్వి తీసేసిన నల్లదాల్ని తిరిగి పెట్టుకుంటూ ఇదా? అబ్బే ఏవుందీ... వెచ్చగా ఉంటుందని పట్టు బట్ట కట్టేను చెవులకోసం తలపాగా, కళ్ళకోసం జోడు, గుండెల కోసం స్వెట్టరూ అంతేగా! అని నా చూపుల్లోని ఆంతర్యాన్ని అర్ధం చేసుకున్న వాడిలాగా ‘ఇహ ఈ రోకలంటూవా? మీ పిన్ని మరీ మరీ చెప్పింది. ఇక్కడ రోకళ్ళు దొరకవని, జాగ్రత్తగా గుర్తుపెట్టుకుని తెమ్మని. మీ పిన్ని సంగతి తెల్సుగా, చిన్న పొరపాటుకి జీవితం అంతా సాధిస్తుంది. అన్నట్లు పైన రోలు, పత్రం కూడా ఉన్నాయి. దింపించు లోపలు నాలుగు మూటలు, రెండు ట్రంకు పెట్టెలూ వుండాలి పద’.

ఆయన చేతిలో ఉన్న రోకలి పెట్టి నా గుండెల పైన కొట్టినట్లుగా ఫీలయ్యాను. ఈ సామానంతా కొంపకి చేర్చాలంటే రిజర్వు బ్యాంకు నుంచి రుణ సహాయం పొందాలేమోనని అనుమానం మొదలయింది. అసలే బాబాయికి చొక్కాకి జేబులుండవ్.

సామానంతటిని క్రిందికి దింపి పేర్చాను. రెండు పాతకాలం పెద్ద ట్రంకులు, మూడు మూటలు, రెండు రోకళ్ళు, రోలు, పత్రం ప్లస్ బాబాయి. మొత్తం అష్టమంగా ఎనిమిది ఆటోలవాళ్ళు చుట్టూ మూగి మాతో సంబంధంలేనట్లు సామాన్లని, మా ఇద్దర్ని పంచేసుకుంటూ వాటాలు కుదరక హిందీలో హైరానా పడిపోతున్నారు. బాబాయి తనకేం పట్టనట్లు రోకలి చేత్తోపుచ్చుకుని పరిసరాలను పర్యవేక్షిస్తూ నిల్చున్నారు.

నాకంతా అయోమయంగా ఏవిటోగా ఉంది. అక్కడున్న వాళ్ళంతా మా ఇద్దరివంకే చూస్తుండటం మరింత ఇబ్బందిగా అనిపించింది. ఆ క్షణంలోని నా పరిస్థితిని ఆకళింపు చేసుకుని ఇదే సన్నివేశాన్ని సినిమా లోగాని పెడితే, హీరో చటుక్కున బస్సు పక్కకి వెళ్ళి రెండు చేతులు ఎత్తి ఆకాశం వైపు చూస్తూ ‘వున్నావా అసలున్నావా? ఉంటే కళ్ళు మూసుకున్నావా? ఈ రోకలి బాధ చూడనన్నావా?’ అంటూ పాడితే, గ్యారంటీగా శ్రీ మహావిష్ణువు కరికిగిపోయి కన్నీళ్ళతో పుష్పక విమానంలో వచ్చి ఆదుకుంటాడు. కాని ఇది సినిమా కాదు జీవితం.

సామానంతా మూడు ఆటోల్లో అతికష్టంపై సర్ద వలసి వచ్చింది. బాబాయి ఒకదాంట్లో, నేను ఒక దాంట్లో, రోకళ్ళు, పుస్తకాల మూటలు మూడోదాంట్లో పట్టించి పట్టుకున్నాను.

మూడు ఆటోలు చరిత్రాత్మకమైన ప్రయాణాలు మొదలు పెట్టినాయి. ముందుగా నే కూర్చున్న ఆటో, వెనక సామాన్లు మాత్రమే ఉన్నది. ఆ వెనుక బాబాయిని భరిస్తున్న ఆటో, ఇలా ప్లాన్‌చేసి ప్రయాణం మొదలు పెట్టాం.

రోడ్లమీద మెల్లిమెల్లిగా రద్దీ పెరుగుతోంది. ఆటోలు తారా జువ్వల్లాగా దూసుకుపోతున్నాయి. నేను మూడు ఆటోలకి కలిపి ఎంత ఇవ్వాల్సి ఉంటుందో, నా దగ్గర ఉన్న మొత్తం ఎంతో వగైరా ఆర్థిక చింతనల్లో మునిగిపోయి ఉండగా, ఆటో డ్రయివర్ హెచ్చరికతో ఈ లోకంలోకి వచ్చి, ఎటు వెళ్ళాలో చెప్పిన మీదట ఆటోలు ఇంటిముందు ఆగాయి.

లోపల్నించి, పిన్ని, కోడలు ఆత్రంగా బయటికొచ్చి సామాన్లు దింపిస్తున్న నాకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్న ధోరణిలో ‘ నీ కడుపు చల్లగా– నువ్వే లేకపోతే ఆడవాళ్ళం ఎంత అవస్థ పడుండే వాళ్ళం? సామాను మెల్లిగా దించు నాయనా.

పచ్చడి జాడీలుండాలి ఏ మూటలో కట్టేరో.... అవునూ ఇంతకీ ఆయనేరి? అనేంతవరకు నాకా ధ్యాసే లేదు. వెనక్కి తిరిగి చూద్దునుగదా బాబాయి ఎక్కిన ఆటో ఇంకా రానేలేదు. ఏమై వుంటుంది? ఆటో పాడయిందా? వేరే త్రోవలో వస్తున్నాడా? బాబాయికి భయపడి డ్రయివర్ బండి విడిచి పారిపోయాడా?

రెండు ఆటోలకి డబ్బులిచ్చి పంపించేసి, గడపలోనే నిల్చున్నాను. పిన్ని ప్రశ్నలకు యాంత్రికంగా బదులు పలుకుతూ కనుచూపుమేర ఆత్రంగా గాలిస్తూ నిల్చుండి పోయేను. పిన్ని ధోరణిలో కాలం గడుస్తున్నకొద్దీ మెల్లి మెల్లిగా మార్పురావటం గమనించాను. కృతజ్ఞతలో మొదలైన సంభాషణ అరగంట గడిచేసరికి నిష్ఠూరంగా ఎత్తిపొడిచే స్థాయికి చేరుకుంది. ఆయనకు టౌను కొత్తనే గదా నిన్ను బతిమాలి పంపింది. ఆటో ఎక్కించిన వాడివి వస్తున్నాడా లేదాని చూసుకోకుండా నీ మానాన నువ్వొచ్చి పడ్డావ్. ఎక్కడ తప్పిపోయాడో, ఏ అవస్థలు పడుతున్నాడో అసలే ఆయన నోరు మంచిదికాదు. అయినా ఈ శీనుగాడికి ఆఫీసుపని కూడా ఇప్పుడే రావాలా మా ఖర్మ కాకపోతే. ఇలా సాగిపోతున్న ఆవిడ వాగ్ధోరణికి అడ్డుకట్ట వేస్తూ ఏం భయపడకండి పిన్నీ, ఆటోకేదో ట్రబులిచ్చి ఉంటుంది. నే వెళ్ళి చూసొస్తాగా అంటూ అక్కడి నుంచి బయట పడ్డానుగాని ఎక్కడని చూడటం? వచ్చిన దారినే వెనక్కు వెళ్ళాలి. తప్పదు.

ఆటో పిల్చి ఎక్కికూర్చున్నాను.

* * *

మధ్యాహ్నం పన్నెండు గంటలయింది. ఎండ చుర్రుమంటోంది. నే తిరగని రోడ్డంటూ లేదు. కాని బాబాయి జాడ మాత్రం తెలీలేదు. నామీద నాకే కోపంగా ఉంది. ఈ మాత్రం వూహించనందుకు? ఇంత తెలివి తక్కువగా ఇరుక్కున్నందుకు. డబ్బుకి డబ్బు ఖర్చయింది. నిందకి నిందా వచ్చిపడింది. స్నానం లేదు, భోజనం, కాఫీ లాంటివి లేవు, ఆఫీసు లేదు, విశ్రాంతి లేదు ఛఛ...

తిరిగి తిరిగి చివరికి తిరగటానికి వీధులు, ఓపిక రెండూ లేక ఓ చెట్టు నీడన నిల్చుండి తీవ్రంగా ఆలోచించాను. కొంపతీసి బాబాయి ఇంటిగ్గాని చేరాడా? ఆ విషయం తెలుసుకోకుండా కాలాన్ని, ఓపికని ఈ విధంగా నడివీధుల్లో వృధా చేయటం తెలివి తక్కువ తనమనిపించి ఇంటిదారి పట్టేను.

ఇల్లు దగ్గరవుతున్న కొద్దీ ఆత్రం ఆందోళన అధికం కాసాగాయి. బాబాయి వచ్చుంటే ఏ చింతా ఉండదు. ఒకవేళ ఇంకా రాకపోతే ఏం చెయ్యాలి? పోలీసు రిపోర్టా? టీవీలో ప్రకటనా? పేపర్లో ఫోటోనా? చిలక జోస్యమా? తిరుపతి మొక్కా? లేక అన్నీనా ఇదంతా నాకొంప కొల్లేరయేందుకే వచ్చినట్లనిపించింది. బిక్కు బిక్కుమంటూ శవం లేచిన ఇంట్లోకి వెళ్ళినట్లుగా వెళ్ళాను.

పిన్ని ఇంకా ఏడుస్తూనే ఉంది.కోడలుపిల్ల ఓదారుస్తోంది. బాబాయి ఇంకా ఇంటికి చేరలేదన్న కఠిన సత్యంతోనే రాజీ పడుతుండగా నా దృష్టి బాబాయి ఆటోలో పెట్టిన వస్తులపైన పడింది. వెర్రి సంతోషంతో ఒక్క గెంతులో పిన్ని కూనిరాగాలు తీస్తున్న గదిలోకి లేగదూడలా గెంతి బాబాయి వచ్చేడా పిన్నీ అంటూ అరిచినట్లుగా అడిగేను.

దానికి పిన్ని కోపంతో కస్సుమంటూ ఆ! వచ్చేడు. దేశమంతా తిరిగి ఆటోవాడికి అరవై రూపాయలు లిచ్చి. పోనీ పోతే పోయింది పాపిష్టి డబ్బు. కాని ట్రంకు పెట్టెలు కూడా పోయినాయిరా... దేవుడా... నా పట్టు చీరలు, వెండి సామాన్లు దాంటో ఉండక పోయినా పోయేదిరా నాయనా అని గొల్లుమన్నది.

"పెట్టెలు మారటమేమిటి? అసలు బాబాయి ఏడి?' ఆ ఇంటి కోడలు నా ప్రశ్నకి చూపులతోనే దొడ్డివైపు చూపించటంతో వెళ్ళి దొడ్లోకి తొంగి చూశాను.

అక్కడ చూసిన దృశ్యాన్ని మర్చిపోవటం రాబోయే కొన్ని జన్మల వరకు సాధ్యం కాదు.

బాబాయి పంపు గట్టు ప్రక్కన కూర్చుని పౌరాణిక నాటకాల్లో రాజులాగా కిరీటాలు, గదులు, కత్తులు ముందేసుకుని ఒక్కొక్కదాన్ని చింతపండు పులుసుతో తళతళ లాడేటట్లుగా తోమే ప్రయత్నంలో తలమునకలుగా ఉన్నారు.

'బాబాయి ఇవన్నీ ఎక్కడివి? అసలయినా పెట్టె ఎక్కడ మాయమయింది?' అనడిగాను ఆ చిన్న కిరీటాన్ని నే పెట్టుకుంటే ఎలా ఉంటుందన్న చిలిపి వూహ చేస్తూనే.

బాబాయి, చేస్తున్న పనిలోంచి తల ఎత్తకుండానే ‘బస్సులోనే అయ్యుంటుంది. నా వెనుక డ్రామా కంపెనీ వాళ్లు పుల్లుగా త్రాగి వొళ్లూ పై తెలీకుండా పడి నిద్దరోయేరు. దిగేటప్పుడు జరిగుంటుంది. పోన్లే. ఎప్పటినుంచో నా కోరిక. పూర్తి కృష్ణుడి వేషంలో ఫోటో తీయించుకోవాలని. ఇన్నాళ్ళకి నెరవేరబోతోంది అదీకాక ఎట్టాగూ నే పనీపాటా లేకుండా ఖాళీగా ఉంటాగా,దుర్యోధనుడో, కర్ణుడో ఏకపాత్రాభినయం ప్రాక్టీసు చేస్తా. రెండు రాళ్ళు సంపాయించుకోవచ్చు. లేదూ! అద్దెకిచ్చయినా నా సొదరు నే సంపాయించుకోగల్ను. ఏవంటావ్. అనడిగాడు.

వాళ్ళున్న ఇంటికి వెనుక వైపు ద్వారం వుండటం నిజంగానే పూర్వజన్మలో చేసుకున్న పుణ్యం అయ్యుంటుంది. పిన్నికంట పడకుండా మూడంగల్లో వచ్చి బజార్లో పడ్డాను.

నీ నీ నీ

రెండు రోజుల తర్వాత అటు వైపుగా వెడుతూ తలతిప్పి ఇంటివైపుగా చూసాను. ఇంటి గుమ్మం పక్కన చిన్న అట్టబోర్డు వ్రేలాడుతోంది. ఇచ్చట గదలు, కిరీటములు, కత్తులు సరసమైన ధరలకు లభించును అని. అంతకన్నా ఆశ్చర్యం బాబాయి వసారాలో గూడకట్టు కట్టి, ఖద్దురు బనీను ధరించి, నెత్తిమీద కిరీటం, చేతిలో కత్తి పుచ్చుకుని ఏక పాత్రాభినయం రిహార్సల్సు చేసుకుంటున్నారు.

లోపలికి వెళ్ళే ధైర్యం చాలక, తలొంచుకుని ఏం తెలీనట్లు ఏం చూడనట్లు వెళ్ళిపోయేను.